


పచ్చని పంట పొలాలు.. చుట్టూరా పచ్చని చెట్లు.. తటాకాలు.. ఎటుచూసినా పరుచుకున్న పచ్చదనంతో కళకళలాడుతున్నది మోస్రా గ్రామం. ప్రకృతి ఒడిలో సేదతీరుతున్నట్లుగా ఆహ్లాదం పంచుతూ చూపరులను ఆకట్టుకుంటున్నది.
– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



జలాల్‌పూర్‌లో పర్యటిస్తున్న నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

## 20లోపు క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేయాలి

### నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

బాల్కొండ/ఆర్మూర్ టౌన్/ముప్కాల్, జనవరి 17 : ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు అర్హుల గుర్తింపు కోసం క్షేత్రస్థాయిలో చేపడుతున్న సర్వేను ఈ నెల 20లోపు పూర్తిచేయాలని నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన బాల్కొండ మండలంలోని జలాల్‌పూర్,ఆర్మూర్ మండలంలోని సూర్బిర్యాల్, ముప్కాల్ మండలంలోని నాగంపేట్ గ్రామంలో పర్యటించారు. సర్వే బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్న తీరును పరిశీలించారు. సర్వే బృందాలు ఇంటింటికీ తిరుగుతూ సేకరిస్తున్న వివరాలను తెలుసుకున్నారు. అర్హులైన లబ్ధిదారులను పక్కాగా గుర్తించాలన్నారు. అన్ని గ్రామాల్లో సర్వేను పూర్తిచేసి, ఈనెల 21 నుంచి 24 వరకు గ్రామసభలు నిర్వహించిన అనంతరం అర్హుల జాబితాను విడుదల చేస్తామన్నారు. జలాల్‌పూర్ శివారులోని ఆయా సర్వే నంబర్లలోని రైతులకు సంబంధించిన పట్టా, అసైన్డ్ భూములను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయి పరిశీలనలో సేకరించిన వివరాలను రిజిస్టర్లలో స్పష్టంగా నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల జాబితాను పారదర్శకంగా రూపొందించాలని సూచించారు.

**అధికారుల పనితీరుపై అసహనం**

ముప్కాల్ మండలంలోని నాగంపేట్ గ్రామంలో చేపట్టిన నాలుగు గ్యారెంటీల సర్వేను కలెక్టర్ పరిశీలించి, అధికారుల పనితీరుపై అసహనం వ్యక్తంచేశారు. నిష్పక్షపాతంగా అర్హులను గుర్తించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, ఆయా మండలాల స్పెషల్ ఆఫీసర్లు స్రవంతి, రసూల్‌బీ, ఎంపీడీవోలు విజయభాస్కర్‌రెడ్డి, సాయిరాం, వ్యవసాయాధికారి హరికృష్ణ, తహసీల్దార్ శ్రీధర్ తదితరులున్నారు.

## సర్వేను పారదర్శకంగా చేపట్టాలి

### కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్




సదాశివనగర్‌లో సర్వేను పరిశీలిస్తున్న కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

రామారెడ్డి, జనవరి17: వ్యవసాయానికి యోగ్యం కాని భూములు, రేషన్‌కార్డుల కోసం చేపట్టిన సర్వేను పక్కాగా నిర్వహించాలని కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన సదాశివనగర్ మండల కేంద్రంలో ప్రభుత్వ దవాఖానను తనిఖీ చేశారు. దవాఖాన పరిసరాలను పరిశీలించి రోగులతో మాట్లాడారు. వారికి వైద్యులు వైద్యం సక్రమంగా చేస్తున్నారా..మందులు ఇస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. సాధారణ ప్రసవాలపై ఆరా తీశారు.అనంతరం గ్రామంలో కొనసాగుతున్న సర్వేను పరిశీలించారు. తహసీల్ కార్యాలయంలో అధికారులతో సమావేశమై ఇప్పటి వరకు పూర్తయిన సర్వే వివరాలను మండల వ్యవసాయ అధికారి ప్రజాపతిని అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్, జిల్లా వైద్యాధికారి చంద్రశేఖర్, మండల ప్రత్యేకాధికారి చందర్‌నాయక్, తహసీల్దార్ గంగాసాగర్, ఎంపీడీవో సంతోష్, ఎంపీవో సురేందర్‌రెడ్డి, అధికారులు ఉన్నారు.

# తేరుకునేలోపే తెంచుకుపోతున్నారు..

## ఉమ్మడి జిల్లాలో రెచ్చిపోతున్న చైన్‌స్నాచర్లు

*కొన్నిరోజులుగా ఉమ్మడి జిల్లాలో చైన్ స్నాచింగ్ ఘటనలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. నగరం, పట్టణాల్లో చోరీలకు అలవాటు పడిన దుండగులు.. కొంత కాలంగా పల్లెలపై పడుతున్నారు. రెండు, మూడురోజులకోసారి ఏదోఒక ప్రాంతంలో గొలుసు దొంగతనం కేసులు వెలుగుచూస్తున్నాయి. చైన్ స్నాచింగ్‌లతో మహిళలు బెంబేలెత్తుతున్నారు. దుండగులు ఒంటరిగా రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న మహిళలను టార్గెట్ చేస్తున్నారు. ద్విచక్ర వాహనాలపై మాస్కులు లేదా హెల్మెట్‌లను ధరించి క్షణాల్లో బంగారు గొలుసులను లాక్కెళ్లుతున్నారు. బాధితులు తేరుకునేలోపే అక్కడి నుంచి మాయమవుతున్నారు. చోరీకి వచ్చే సమయంలో గుర్తు పట్టకుండా ఉండడానికి ద్విచక్రవాహనాలకు బోగస్ రిజిస్ట్రేషన్ నంబర్లను వినియోగిస్తున్నారు. ముఖ్యంగా శివారు ప్రాంతాల్లో ఇలాంటి ఘటనలు అధికంగా చోటు చేసుకుంటున్నాయి. గొలుసు దొంగతనాలను అరికట్టడంలో పోలీసులు విఫలమవుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.*
*–నిజామాబాద్, జనవరి 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*




- రూటు మార్చిన కేటుగాళ్లు..
- పట్టణాలను వదిలి పల్లెల వైపు..
- పెరుగుతున్న గొలుసు దొంగతనాలు
- ఒంటరిగా వెళ్లే మహిళలనే టార్గెట్ చేస్తున్న దుండగులు
- కేసులను ఛేదించడంలో విఫలమవుతున్న పోలీసులు
- 2024లో అత్యధికంగా 37 చైన్‌స్నాచింగ్ ఘటనలు


ఇటీవల కాలంలో బోధన్, ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గాల్లో చైన్‌స్నాచింగ్ ఘటనలు ఎక్కువగా జరుగుతుండడంపై స్థానికుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. కేటుగాళ్లు రూట్ మార్చి మాటు వేసి సొమ్ములను మాయం చేస్తుండడంతో పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. గతంలో పట్టణాలు, నగరాల్లోనే చైన్ స్నాచింగ్‌లు ఎక్కువగా జరిగాయి. సీసీ కెమెరాల ఏర్పాటుతో అడ్డుకట్ట పడగా.. గొలుసు దొంగతనాలు ఇప్పుడు గ్రామీణ ప్రాంతానికి విస్తరించాయి. నిందితులను పట్టుకోవడం నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ ఖాకీలకు కత్తి మీది సాములా మారింది. ఓవైపు సీసీ కెమెరాలు పని చేయకపోవడం, మరోవైపు కేటుగాళ్లు ఏకంగా చోరీచేసిన వాహనాలను వినియోగిస్తుండడం పోలీసులకు సవాల్‌గా మారింది.

పట్టణాలు, నగరాల్లో చైన్ స్నాచర్ల ఆగడాలు తగ్గిపోగా, పల్లెల్లో పెరుగుతున్నాయి. పట్టణాల్లో రద్దీ ఎక్కువగా ఉండడంతోపాటు సీసీ కెమెరాల ద్వారా నిందితులను గుర్తించడానికి అవకాశం ఉంటుంది. దీంతో దుండగులు నయా పంథాను ఎంచుకున్నట్లు తెలుస్తున్నది. కొంత కాలంగా వెలుగుచూస్తున్న చైన్ స్నాచింగ్ ఘటనలన్నీ గ్రామీణ ప్రాంతాల్లోనే చోటుచేసుకుంటుండడం గమనార్హం. గ్రామాల్లో మధ్యాహ్నమే దొంగలు చెలరేగిపోతున్నారు. వ్యవసాయ పనులకు మగవారు వెళ్తుండడంతో ఇంటి వద్దే ఉండే గృహిణులు ఎక్కువగా వీరి బారిన పడుతున్నారు. ఇందులో నిర్మానుష్య, శివారు ప్రాంతాలనే కేటుగాళ్లు ఎంచుకుంటున్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఎక్కువగా లేకపోవడం, ఒకవేళ ఉన్నా అవి అంతగా పని చేయకపోవడం దొంగలకు కలిసి వస్తున్నది. చైన్ స్నాచర్లు తమ పంథాను మార్చి తెగబడుతున్నప్పటికీ, పోలీసులు అప్రమత్తత లేకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కనీసం ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలోనూ విఫలమైనట్లు ఆరోపణలున్నాయి. దొంగతనాలకు ముందు ఒకటి రెండు రోజులు రెక్కీ నిర్వహించి ప్రజల కదలికలు, వాహనాల రాకపోకలను తెలుసుకున్న తర్వాతే స్నాచర్లు రంగంలోకి దిగుతున్నట్లుగా పోలీసులు గుర్తించారు. పండుగ, పబ్బం లేకుండా పూట పూటకూ హెల్మెట్ లేని వాహనాదారులపై జరిమానాల పేరిట కొరడా ఝుళిపించే పోలీసులకు సంఘ విద్రోహ శక్తులు కంటికి కనిపించడం లేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గ్రామాల్లో అనుమానితులు, కొత్త వ్యక్తుల సంచారంపై కన్నేసి ఉంచాలని, అనుమానం ఉంటే వెంటనే సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచిస్తున్నారు.

### గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకోవాలి

గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఇది సామాజిక బాధ్యతగా వీడీసీలు చొరవ తీసుకోవాలి. గ్రామాలకు వచ్చి, వెళ్లే దారుల్లో సీసీ కెమెరాలు అమరిస్తే దొంగలను గుర్తించడం సులువవుతుంది. చైన్ స్నాచింగ్ కేసుల్లో దుండగులను పట్టుకోవడంలో పోలీసులు తీవ్రంగా కృషి చేస్తున్నారు. జల్సాలకు అలవాటు పడుతున్న కొంత మంది యువత చెడు మార్గంలో వెళ్తున్నారు. త్వరగా డబ్బు సంపాదించేందుకు వక్రమార్గాన్ని ఎంచుకుని జీవితాలను బుగ్గి చేసుకుంటున్నారు.

**- ఎల్.రాజా వెంకట్‌రెడ్డి, ఏసీపీ, నిజామాబాద్**



### పడకేసిన దర్యాప్తు...

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గడిచిన మూడేండ్లలో చైన్ స్నాచింగ్ కేసులు పెరుగుతున్నాయి. మొత్తం కేసుల్లో మహిళలే బాధితులుగా ఉంటున్నారు. 30 నుంచి 40 ఏండ్ల వయస్సు కలిగిన వారితోపాటు వృద్ధులు సైతం చైన్ స్నాచింగ్ దొంగల బారిన పడుతున్నారు. రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్నవారిని టార్గెట్ చేయడంతో మహిళలు భయాందోళనకు గురవుతున్నారు. 2022లో నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో 26 కేసులు వెలుగు చూశాయి. కేవలం 13 కేసులనే పోలీసులు ఛేదించారు. ఇందులో 50 శాతం మాత్రమే దర్యాప్తుచేపట్టగా సత్ఫలితాలు వచ్చాయి. 2023లో అత్యధికంగా 40 గొలుసు దొంగతనాలు జరిగాయి. కేవలం 18 కేసుల్లోనే పురోగతి సాధించగా.. మిగతా కేసుల జాడలేదు. ఇందులో నిందితులను గుర్తించడంలో పోలీసులు వెనుకబడ్డారు. 2023లో వెలుగు చూసిన చైన్ స్నాచింగ్ కేసుల్లో కేవలం 45శాతం కేసుల్లోనే దర్యాప్తు ఆశాజనకంగా సాగింది. 2024లో 37 కేసులు నమోదుకాగా, ఇందులో 7 కేసుల్లోనే పురోగతి సాధించారు. కేవలం 18శాతం కేసులను మాత్రమే పరిష్కరించారు. 30 కేసులను ఇప్పటివరకూ ఛేదించకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఖాకీలకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నది. కావాల్సినంత సిబ్బంది అందుబాటులో ఉన్నారు. అయినప్పటికీ చైన్ స్నాచర్లను పట్టుకోవడంలో పోలీసుల నిర్లిప్తత కొట్టొచ్చినట్లుగా కనిపిస్తున్నది.

## గుప్త నిధుల కోసం తవ్వకాలు

లింగంపేట, జనవరి17: మండలంలోని కేశాయిపేట గ్రామ శివారులో గురువారం రాత్రి గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపట్టినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామ శివారులోని వ్యవసాయక్షేత్రంలో ఎవరో క్షుద్ర పూజలు చేసినట్లు పేర్కొన్నారు. రెండు వారాల క్రితం గ్రామంలో ఇద్దరు యువకులు అనుమానాస్పదంగా సంచరించినట్లు ప్రచారం జరుగుతున్నది. గ్రామస్తుల సహకారంతోనే గుర్తు తెలియని వ్యక్తులు తవ్వకాలు చేపట్టినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో బోరు వేసిన సమయంలో గుప్త నిధులు లభించినట్లు ప్రచారం జరిగింది. తిరిగి అదే ప్రాంతంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి, తవ్వకాలు చేపట్టినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయమై స్థానిక ఎస్సై సుధాకర్‌ను వివరణ కోరగా, గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపట్టిన విషయం తమ దృష్టికి రాలేదని వెల్లడించారు.



కేశాయిపేట గ్రామ శివారులో గుప్త నిధుల కోసం తవ్విన ప్రదేశం

## విద్యుత్‌షాక్‌తో బాలుడికి తీవ్ర గాయాలు

### కరెంట్ వైర్లపై నుంచి గాలిపటం తీసేందుకు యత్నిస్తుండగా ప్రమాదం

వినాయక్‌నగర్, జనవరి17: ఇంటి భవనంపై విద్యుత్ తీగలకు తట్టుకున్న గాలిపటాన్ని తీసేందుకు యత్నించిన బాలుడు విద్యుదాఘాతానికి గురయ్యాడు. బాలుడి ఒళ్లంతా గాయాలు కావడంతో దవాఖానకు తరలించారు. ఈ ఘటన జిల్లా కేంద్రంలోని మహబూబ్‌కాలనీలో శుక్రవారం చోటుచేసుకున్నది. షేక్ జీశాంత్ అనే బాలుడు ఇంటిపై ఉన్న విద్యుత్ తీగలకు గాలిపటం చిక్కుకున్నది. గమనించిన బాలుడు బంగ్లాపైకి ఎక్కి గాలిపటం తీస్తుండగా విద్యుత్ సర్వీస్ వైర్ చేతికి తగిలి షాక్‌కు గురయ్యాడు. దీంతో బాలుడి శరీరం సుమారు యాభై శాతం కాలిపోవడంతో కుటుంబీకులు హుటాహుటిన చికిత్స నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. బాలుడి తండ్రి షేక్ షబ్బీర్ ఫిర్యాదు మేరకు నాల్గోటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.



కాలిన గాయాలతో బాలుడు




*మండలంలో ఇసుక అక్రమ రవాణా ఆగడంలేదు.* అధికారులు ఎన్ని చర్యలు తీసుకున్నా ఫలితం కనిపించడం లేదు. మండలంలోని కప్పలవాగు నుంచి ఇసుకను అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతున్నది. ట్రాక్టర్ల ద్వారా కాకుండా రాత్రివేళ ఎడ్లబండ్లపై ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ప్రతిరోజూ సుమారు 50 ఎడ్లబండ్ల ద్వారా వందల ట్రిప్పుల ఇసుకను తరలిస్తూ మండల కేంద్రంలో డంపులను ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికొడుతున్నారు. ఎడ్లబండిపై తరలిస్తే పోలీసులకు ఎలాంటి అనుమానమూ రాకపోవడంతోపాటు జరిమానా, కేసులు ఉండవనే ధీమాతో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. మండలంలో గురువారం రాత్రి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

*–భీమ్‌గల్, జనవరి 17*

## డీఎంహెచ్‌వో పేరిట వసూళ్లు

- తాను మెడికల్ ఆఫీసర్ నంటూ బెదిరింపులు
- బట్టబయలైన లింగాపూర్ పల్లెదవాఖాన కాంట్రాక్ట్ ఉద్యోగి బాగోతం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన ఆర్ఎంపీలు

లింగంపేట, జనవరి 17: తాను మెడికల్ ఆఫీసర్ అని , కామారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పేరు చెప్పి డబ్బులు వసూలు చేస్తున్న లింగాపూర్ పల్లెదవాఖాన కాంట్రాక్ట్ ఉద్యోగి బాలకృష్ణను ఆర్ఎంపీ, పీఎంపీలు శుక్రవారం పోలీసులకు అప్పగించారు. కామారెడ్డి పట్టణ పరిధిలోని లింగాపూర్ పల్లె దవాఖానలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్న బాలకృష్ణ తాను మెడికల్ ఆఫీసర్ నంటూ డీఎంహెచ్‌వో పేరిట ఆర్ఎంపీలు, పీఎంపీలను బెదిరించేవాడు. మీపై ఫిర్యాదులు వచ్చాయని, ఉన్నతాధికారులు దవాఖాన తనిఖీ కోసం వస్తే దవాఖానలను సీజ్ చేస్తారంటూ భయపెట్టేవాడు. తనకు డబ్బులు ఇస్తే డీఎంహెచ్‌వో నుంచి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటానని నమ్మించేవాడు. ఈ క్రమంలో శుక్రవారం మండల కేంద్రంలోని ఆర్ఎంపీ రషీద్ నుంచి బాలకృష్ణ రూ.15వేలు వసూలు చేశాడు. అనంతరం మరో ఆర్ఎంపీ ముబీన్ వద్దకు వెళ్లాడు. అతడి నుంచి రూ. 10వేలు వసూలు చేయగా.. అనుమానం వచ్చి ముబీన్ నిలదీయడంతో బాలకృష్ణ అసలు విషయం బయట పడింది. వెంటనే ఇద్దరు ఆర్ఎంపీలు బాలకృష్ణను పోలీసుస్టేషన్‌కు తరలించి, ఫిర్యాదు చేశారు. బాలకృష్ణ గతంలోనూ మండల కేంద్రంలోని మల్లేశ్ అనే వైద్యుడి వద్ద రూ.15వేలు తీసుకువెళ్లినట్లు నిర్ధారించారు. డీఎంహెచ్‌వో చంద్రశేఖర్‌కు కూడా ఫిర్యాదు చేయనున్నట్లు ఆర్ఎంపీలు తెలిపారు.






మెడికల్ ఆఫీసర్‌గా తయారుచేసుకున్న ఐడీ కార్డు, బాలకృష్ణ (ఇన్‌సెట్‌లో)